## క్లుప్తంగా

### వైభవంగా హనుమంతసేవ



హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సంతాన వేణుగోపాలస్వామి

సోమశిల: అనంతసాగరం మండలం కచిరిదేవరాయపల్లిలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూలతో అలంకరించిన ఉత్సవమూర్తులతో హనుమంత వాహనంపై ఊరేగించారు. ఉభయకర్తలుగా మోదుగల గంగాధరం, అమ్మణ్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

### సీడీపీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కె.సౌజన్య

కావలిరూరల్: కావలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓగా కె.సౌజన్యతో పాటు అసిస్టెంట్ సీడీపీఓగా టి.శారద మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ ఎక్కడా కూడా ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా విధులు నిర్వహిస్తామన్నారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీడీపీఓ పద్మజాకుమారి వింజమూరుకు బదిలీ అయ్యారు.

### ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీలోపు ఏపీజీపీసెట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

### రామాలయంలో చోరీ వదంతి

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి కోదండ రామాలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు మంగళవారం గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. చేజర్ల ఎస్సై మరిడి నాయుడు తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులను ప్రశ్నించారు. అక్కడి పరిస్థితులను చూసి చోరీ జరిగిన ఆనవాళ్లు లేవని స్పష్టం చేశారు. దేవాలయాల వద్ద చోరీలు జరగకుండా గ్రామస్తులే కమిటీ వేసుకుని పర్యవేక్షించాలని పోలీసులు సహకరిస్తారని తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో అంకాళమ్మ విగ్రహప్రతిష్ట



ప్రత్యేకాలంకరణలో అమ్మవారి ప్రతిష్ట విగ్రహం

వింజమూరు: మండలంలోని గుండెమడకలలో అంకాళమ్మ తల్లి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు మంగళవారం మూడోరోజు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతిమంత్ర పఠనం నిర్వహించారు. తోరణ బంధనం గావించారు. యాగశాలలో దంపతులతో యాగం నిర్వహించారు. మూలవిరాట్‌లను, ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. విగ్రహ ప్రతిష్ట ఉత్సవాల్లో భాగంగా బుధవారం అంకాళమ్మ తల్లికి విశేషహోమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

### హంజాహుస్సేన్‌కు సన్మానం



హంజాహుస్సేన్‌ను సన్మానిస్తున్న ఉదయగిరి నేతలు

ఉదయగిరి: నెల్లూరు, వైఎస్సార్, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన సయ్యద్ హంజాహుస్సేన్‌ను మంగళవారం ఉదయగిరి మైనార్టీ నేతలు నెల్లూరులో ఆయన్ను కలిసి ఘనంగా సన్మానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆయన్ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్దాని, ఉదయగిరి ఉప సర్పంచ్ ముర్తుజాహుస్సేన్, డీఎంసీ డైరెక్టర్ ఖిల్జీ సలీం, మస్తాన్, బాషా, అక్కుల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

---

కావలి డివిజన్ పరిధిలో ఇప్పుడిప్పుడే వరి కోతలు మొదలవుతున్నాయి. అందుబాటులో యంత్రాలు తక్కువగా ఉండడంతో ముందుగానే బాడుగలు విపరీతంగా పెంచేస్తున్నారు. రైతులను యజమానులు నిలువునా దోచుకుంటున్నారు. వరికోత యంత్రాలు అందుబాటులో లేవనే సాకుతో గతేడాది కన్నా అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు.



కావలి మండలంలో వరి కోస్తున్న యంత్రం

# రైతుకు 'కోత' వెతలు

- భారీగా పెంచిన వరికోత యంత్రాల బాడుగలు
- గతేడాది రూ.1,600– రూ.1,800
- ఇప్పుడు ప్రారంభంలోనే రూ.2,300

కావలి/బిట్రగుంట: ఒక్కసారిగా వరికోతలు రావడం, యంత్రాలు అందుబాటులో లేకపోవడం, ప్రస్తుతం ధాన్యానికి మంచి ధర లభిస్తుండడంతో అడిగినంత చెల్లిస్తారనే నమ్మకంతో వరికోత యంత్రాల బాడుగలను యంత్రాల యజమానులు విపరీతంగా పెంచేసి దోచుకుంటున్నారు. గతేడాది వరికోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలోనే గంటకు రూ.1,600 నుంచి రూ.1,800 వరకు వసూలు చేయగా ఈ ఏడాది మాత్రం వరికోతలు ప్రారంభంలోనే గంటకు రూ.2,300 వంతున వసూలు చేస్తున్నారు. వరికోతలు ముమ్మరంగా మొదలైతే గంటకు రూ.2,800 వరకు వసూలు చేసే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతల ప్రారంభంలోనే గంటకు రూ.2,300, డ్రైవర్‌కు రూ.200 వంతున వసూలు చేయడం ప్రారంభించారు. డీజిల్ ధరలు పెరిగాయని, పక్క రాష్ట్రాల్లో గిరాకీ ఎక్కువ ఉందని చెబుతూ రైతులను నిలువునా దోచుకుంటున్నారు. సాధారణంగా ఎకరా వరికోత కోసేందుకు కనీసం గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. దీంతో ఎకరా కోత ఖర్చే రూ.5,000 అవుతుంది. ఈ ఏడాది పలు రకాల తెగుళ్లతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో వరికోత బాడుగలు కూడా విపరీతంగా పెంచేయడంతో రైతులు కుదేలవుతున్నారు.

**నియోజకవర్గంలో లక్ష ఎకరాల్లో సాగు**

కావలి నియోజకవర్గంలో ఈ దఫా రబీ సీజన్‌లో లక్ష ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ప్రధానంగా రైతులు బీపీటీ 5204, ఎన్‌ఎల్‌ఆర్ 3449, ఆర్‌ఎన్‌ఆర్ 15648, ఎంటీయూ 1010 తదితర రకాలు సాగు చేశారు. అల్లూరు, దగదర్తి, బోగోలు, కావలిరూరల్ తదితర మండలాల్లో ఇప్పుడిప్పుడే కోతలు మొదలవుతున్నాయి. మరో పది రోజుల్లో కనీసం 25 శాతం పంట కోతకు వచ్చే పరిస్థితులు ఉన్నాయి.

**రాయితీపై కొనుగోలు చేసిన యంత్రాలు ఎక్కడ?**

కావలి నియోజకవర్గంలో ప్రభుత్వం 9 వరికోత యంత్రాలు రైతు గ్రూపులకు సబ్సిడీపై అందజేసింది. రూ.25 లక్షలు చేసే వరికోత యంత్రాలను ప్రభుత్వం రూ.10 లక్షల సబ్సిడీ కింద ఆర్థిక సహాయాన్ని అందించింది. మిగిలిన రూ.15 లక్షలు లబ్ధిదారులు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ యంత్రాలు కూడా కోతల నిమిత్తం పక్క రాష్ట్రాల్లో ఉన్నాయి. జిల్లాలో కోతలు ప్రారంభమయ్యే సమయంలో నియోజకవర్గంలో ఉంటే కొంత రైతులకు వెసులుబాటు ఉండే అవకాశం ఉంది. ఇవి కూడా లేకపోవడంతో ప్రైవేట్ వరికోత యజమానులు కృత్రిమ కొరత సృష్టించి బాడుగలు భారీగా పెంచేస్తున్నారు. కోతల సమయంలో వర్షాలు వచ్చే సూచనలు కనిపిస్తే గంటకు రూ.3,000 వరకు కూడా గతేడాది బాడుగలు వసూలు చేసిన ఘటనలు ఉన్నాయి. కోతలు పూర్తయ్యే వరకు రాయితీపై పొందిన యంత్రాలను ఇక్కడే ఉండే విధంగా, ప్రైవేట్ వరి కోతల యంత్రాల బాడుగులపై అధికారులు నియంత్రణ విధించాలని కోరుతున్నారు.

**కోత రేట్లు ఎక్కువగా ఉన్నాయి**



వరి కోత యంత్రానికి గంటకు రూ.2,300 తీసుకుంటున్నారు. డ్రైవర్ మామూలు ఇవ్వాలి. వరికోత మిషన్‌కు సంబంధించిన ముగ్గురు మనుషులు ఉంటారు. వారికి టిఫిన్, భోజనాలు కూడా ఏర్పాటు చేయాలి. పంట కోతలు ప్రారంభ సమయంలోనే వరి కోతల యంత్రాల యజమానులు చాలా డిమాండ్ గా మాట్లాడుతున్నారు. ఇక కోత జోరందుకుంటే రేట్లు పెంచేస్తారు. ప్రభుత్వం సబ్సిడీపై వరి కోత యంత్రాలు తీసుకున్న వారు అసలు ఎక్కడ ఉన్నారో కూడా తెలియదు.

– షేక్ రసూల్ బాషా, రైతు, అల్లూరు

**రైతుల సౌలభ్యం కోసమే సబ్సిడీపై వరికోత యంత్రాలు**



ప్రభుత్వం రైతు గ్రూపులకు సబ్సిడీపై ఇచ్చే వరికోత యంత్రాలు సహచర రైతులకు అన్ని రకాలుగా సౌలభ్యంగా ఉండాలనేది లక్ష్యం. అయితే వరికోత యంత్రాలు నిర్వహణ ఆర్థికంగా భారం అవుతుందని సబ్సిడీపై తీసుకున్న వారు చెబుతున్నారు. అయినప్పటికీ వ్యాపారులు కన్నా కొంతైనా బాడుగ తగ్గించి రైతుల వద్ద తీసుకోవాలని చెబుతుంటాం. కొత్తగా వరికోత యంత్రాలు ప్రభుత్వం సబ్సిడీ పై మంజూరు చేయడానికి దరఖాస్తులు తీసుకుంటున్నాం.

– కె.కన్నయ్య, ఏడీఏ, కావలి

### సమన్వయంతో భక్తులకు భద్రత

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసులు అందించిన సేవలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్పీ సీహెచ్ విజయారావు ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో సుమారు 400 మంది పోలీసు సిబ్బంది ఉత్సవాల విధుల్లో పాల్గొన్నారు. ఎస్పీ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పార్కింగ్ పాయింట్లు, క్యూలైన్లు, తలనీలాలు సమర్పించే ప్రాంగణం, అన్నదాన సత్రాలు, దుకాణ సముదాయాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో చిన్న పాటి చిల్లర ఘటనలు కూడా చోటుచేసుకోలేదు. ఈ దఫా చిన్న పిల్లలు తప్పిపోతే వెంటనే తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా ప్రత్యేక బృందాలు, అనుమానితులను పసిగట్టి వేలిముద్రలు సేకరించేలా ప్రత్యేకంగా సీసీఎస్ బృందాలను నియమించడంపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

### 48 గంటల ముందు ఎమ్మెల్సీ ప్రచారానికి బ్రేక్

ఉదయగిరి: ఈ నెల 13వ తేదీ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచారాన్ని 48 గంటల ముందు నిలిపివేయాలని ఎంపీడీఓ పి.ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.పోలింగ్ రోజు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

# వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులను గెలిపించాలి



ఆత్మకూరు రూరల్: కరటంపాడులో ప్రచారం నిర్వహిస్తున్న వల్లభనేని రాజేష్, తదితరులు



వింజమూరు: ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఏఎస్‌పేట: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మర్రిపాడు: రాజుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆత్మకూరు: ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ మద్దతుతో తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆత్మకూరు మండల సచివాలయాల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర తెలిపారు. మండలంలోని కరటంపాడు, రామాపురం, సాతానుపల్లి, శ్రీనివాసపురం తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా మంగళవారం స్థానిక నాయకులతో కలిసి విస్తృతం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు కూడా ఉన్నత చదువులు చదివి పట్టభద్రులుగా, ఆ తర్వాత ఉద్యోగులుగా తమ జీవితాల్లో స్థిరపడడానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కారణమన్నారు. తండ్రి బాటలో నడుస్తున్న ముఖ్యమంత్రి విద్యా వ్యవస్థలోనే సమూల మార్పులు తెచ్చి దేశానికే ఆదర్శమయ్యారన్నారు. కార్యక్రమంలో బోయలచిరివెళ్ల సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనాల రమేష్ నాయుడు, ఉస్మాన్ ఖాన్, వల్లభనేని శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

**వింజమూరులో..**

వింజమూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని బుక్కాపురం, ఏ కిస్టీపురం పంచాయతీల్లో పట్టభద్రులను కలిశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు, సర్పంచ్ రసూల్, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉపసర్పంచ్ కాటం రమణారెడ్డి, రాయుడు, అంకినపల్లి నరసింహారెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

**ముమ్మరంగా ఎన్నికల ప్రచారం**

అనుమసముద్రంపేట: మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలపై ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అనుమసముద్రం, ఏఎస్‌పేటలో జేసీఎస్ కో ఆర్డినేటర్ పులిమి వెంకట రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. దివంగత వైఎస్సార్, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధిగా అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఎంతో మంది విద్యావంతులయ్యారన్నారు. ఆయన వెంట మాజీ కో ఆప్షన్ సభ్యులు రియాజ్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

**పేర్నాటిని గెలిపిద్దాం**

మర్రిపాడు: రానున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ మండల కో ఆర్డినేటర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని చుంచులూరు, కదిరినాయుడుపల్లి, పడమటినాయుడుపల్లి, సన్నువారిపల్లి, ఏపిలగుంట, చిలకపాడు, పెగళ్లపాడు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు గుర్రం నాగేశ్వరరావు, నారాయణస్వామి, నాయుడు హజరత్ రెడ్డి, సర్పంచ్ హరితేజ, చామంచయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఓటరు స్లిప్పుల పంపిణీ**

చేజర్ల: త్వరలో జరగనున్న తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పులను రెవెన్యూ సిబ్బంది ద్వారా పంపిణీ చేసినట్లు తహసీల్దార్ శివకృష్ణయ్య మంగళవారం తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్లుగా నమోదైన పట్టభద్రులకు ఇప్పటి వరకు 88 శాతం పూర్తి చేసినట్లు, బుధవారం మిగిలిన ఓటర్లకు స్లిప్పులు అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

**మొదటి ప్రాధాన్యతా ఓటు వేయండి**

ఆత్మకూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయాన్ని కోరుతూ ఆత్మకూరు పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మొదటి ప్రాధాన్యతా ఓటు పార్టీ మద్దతుతో పోటీచేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలకు ఓటు వేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, చైర్‌పర్సన్ సి వెంకటరమణమ్మ, కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మహబూబ్ బాషా, ఎం.రాజశేఖర్, టి తిరుపతమ్మ నౌషద్‌బేగం, పార్టీ నాయకులు షబ్బీర్‌బాషా, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ఎ.ప్రతాప్ పాల్గొన్నారు.

**పీడీఎఫ్ ప్రచారం**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థులు ఎం.వెంకటేశ్వరరెడ్డి, బాబురెడ్డిలను అధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఎం, జేవీవీ కేవీటీఎస్ నాయకులు డేవిడ్‌రాజు, ఎస్కే సందాని, నాగయ్య, ఖజారంతుల్లా, బుల్‌జార్‌బేగం తదితరులు ప్రచారం నిర్వహించారు.

# చెడుగుడు పోటీల విజేత ముదివర్తి



మొదటి స్థానంలో నిలిచిన ముదివర్తి జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

సంగం: దువ్వూరులోని కలవకూరు కోటారెడ్డి క్రీడా ప్రాంగణంలో నాలుగు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు సోమవారం అర్ధరాత్రితో ముగిశాయి. రాష్ట్రంలోని నెల్లూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల నలుమూలల నుంచి 32కు పైగా జట్లు హోరాహోరీగా నువ్వా నేనా అంటూ తలపడ్డాయి. ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయి మొదటి బహుమతి ముదివర్తి టీమ్ రూ.30,016 కైవశం చేసుకున్నారు. రెండో బహుమతి రూ.25,016 అల్లూరు, మూడు, నాలుగు బహుమతులు రూ.21,016, రూ.18,016 దువ్వూరు జట్లు గెలుపొందారు. ఐదో బహుమతి రూ.16,016 మోపూరు, ఆరో బహుమతి రూ.14,016 చీరాల, ఏడో బహుమతి రూ.12,016 చిన్నగంజాం, 8వ బహుమతి రూ.10,016 రాపూరు జట్టు కైవశం చేసుకున్నాయి. బెస్ట్ అఫెన్స్‌గా ముదివర్తి టీమ్‌కు చెందిన నవీన్, డిఫెన్స్ దువ్వూరు జట్టుకు చెందిన వంశీ, అల్ రౌండర్ ప్రతిభ ముదివర్తి టీమ్‌కు చెందిన రవిని ఎంపిక చేశారు. న్యాయనిర్ణేతగా శీనయ్య వ్యవహరించారు. విజేతలకు సంగం మండల జెడ్పీటీసీ సభ్యుడు రావుల లక్ష్మీప్రసాద్‌గౌడ్ దంపతులు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎం.దేవసహాయం, ఎస్సై నాగార్జున్‌రెడ్డి, కలవకూరు గణేష్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరి రాజా, గ్రామీణులు పాల్గొన్నారు.

# మహిళలే మహారాణులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జ రాజేష్

ఆత్మకూరురూరల్: ప్రతి కుటుంబంలో మహిళలే మహారాణులని వారి దీవెనలు, సేవలతోనే కుటుంబ వ్యవస్థ వర్ధిల్లుతోందని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బట్టేపాడు సచివాలయం వద్ద మంగళవారం మహిళలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా, కుటుంబంలో మహిళలు అందిస్తున్న సేవలు అనితర సాధ్యమైనవని ఆయన విశదీకరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో అగ్రస్థానం ఇస్తున్నారని రాజ్యాంగ పరంగా వారి హక్కులకు ఎళ్ల వేళలా అండగా ఉండేందుకు కోర్టులు చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాయన్నారు. బట్టేపాడు సొసైటీ చైర్మన్ వాసిపల్లి లక్ష్మీరెడ్డి, స్థానిక సర్పంచ్ చెరుకూరు చిన్న చెంచయ్య, ఆత్మకూరు ఎస్సై రాజేష్ తదితరులు మాట్లాడుతూ మహిళల రిజర్వేషన్లు, పథకాల అమల్లో ప్రభుత్వం అందిస్తున్న అండదండలను తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, సంక్షేమ సహాయకురాలు నవీన, సచివాలయం పరిధిలోని పలువురు మహిళలు పాల్గొన్నారు.

# నూతన ఎమ్మెల్సీకి అభినందనలు



మేరిగ మురళిని అభినందిస్తున్న నాయకులు



మేరిగని కలిసిన జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మీ

ఆత్మకూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మేరిగ మురళిని ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. మంగళవారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన్ను ఆత్మకూరు నాయకులు కలిసి శాలువా కప్పి బొకేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్ మహబూబ్‌బాషా, సురేష్‌యాదవ్, వల్లెపు వెంకటేశ్వర్లు, నందవరం ప్రతాప్, వెంకటరమణ పాల్గొన్నారు.

**జెడ్పీటీసీ అభినందనలు**

ఆత్మకూరురూరల్: ఉమ్మడి ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మేరిగ మురళిని ఆత్మకూరు జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి తన భర్త శ్రీనివాసులు నాయుడుతో కలిసి మంగళవారం అభినందనలు తెలిపారు.

# మహిళా కమిషన్‌పై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న మాలకొండారెడ్డి

కావలి రూరల్: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళా కమిషన్‌పై అవగాహన పెంచుకుని రక్షణ పొందాలని సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి తెలిపారు. పట్టణంలోని ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం మహిళా చైతన్య సదస్సు నిర్వహించారు. అత్యవసర సమయాల్లో రక్షణ కోసం సహాయ నంబర్లు 181, 100, 112, 1018, 1091 ద్వారా రక్షణ పొందవచ్చునన్నారు. అనంతరం పేద మహిళలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దుగ్గిరాల దనకుమారి, కవిత, చలంచర్ల కావ్య, సీహెచ్ మల్లిక, స్వాతి, మహిళలు పాల్గొన్నారు.

# మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలకు రుణపడి ఉంటా



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న మాలకొండారెడ్డి

జలదంకి: రాజ్యసభ సభ్యుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డికి జీవితకాలం రుణపడి ఉంటానని పాలవెల్లి మాలకొండారెడ్డి వైస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పాలవెల్లి మాలకొండారెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరులో వీరిని కలిసి శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన మేరిగ మురళి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి జలదంకి సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటశేషారెడ్డి గుమ్మడి రమేష్,పులిమి బాబుల్ రెడ్డి, వర్ధినేని మురళి, వట్టికాల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎండల ధాటికి జాగ్రత్తలు ముఖ్యం



మాట్లాడుతున్న వైద్యాధికారి గోపినాథ్

మర్రిపాడు: రానున్న వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి గోపినాథ్ అన్నారు. మర్రిపాడులోని పీహెచ్‌సీలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిందన్నారు. మర్రిపాడు మండలం మెట్ట ప్రాంతం కావడంతో ఎండలతో పాటు వడగాలులు వీచే అవకాశం ఎక్కువన్నారు. వేసవికాలంలో తగు జాగ్రత్తలు పాటించాలని, లేని పక్షంలో వడదెబ్బకు గురికావాల్సి వస్తుందన్నారు. పనుల కోసం బయటకు వెళ్లే వారు కచ్చితంగా మజ్జిగ, తాగేందుకు మంచినీరు దగ్గరుంచుకోవాలన్నారు. వేసవికాలంలో నల్లటి సిల్క్ దుస్తులు ధరించరాదన్నారు. ఏమైనా అనారోగ్య సమస్యలు సంభవిస్తే వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

# పత్తి పంటలో జాగ్రత్తలు ముఖ్యం



పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి రామ్మోహన్

మర్రిపాడు: ప్రస్తుత సీజన్‌లో పత్తిపంటలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి రామ్మోహన్ అన్నారు. మండలంలోని అల్లంపాడులో మంగళవారం ఆయన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిలో అధికంగా రసం పీల్చే పురుగులు పచ్చ దోమ, పేనుబంక తెల్లదోమ పురుగులు ఉన్నాయన్నారు. వీటి నివారణకు ఎసిఫెట్ 1.5 గ్రాములను లేదా అసిటామిప్రైడ్ 0.3 గ్రా. మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మెగ్నిషియం లోపం ఉంటే ఆకులు ఈనెలు పచ్చగా ఉండి ఈనెల మధ్య ఇటుక ఎరుపు రంగులో ఉంటుందన్నారు. నివారణకు మెగ్నిషియం సల్ఫేట్‌ను 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఎకరాకు 10 చొప్పున పసుపు అట్టలను ఏర్పాటు చేసుకుంటే రసం పీల్చే పురుగు ఉధృతి తగ్గించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు సీహెచ్ పవన్‌కల్యాణ్, పలువురు రైతులు పాల్గొన్నారు.